అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా మంగళవారం ముగిసింది. ఈ క్రాఫ్ట్ మేళాలో పలు స్టాళ్లు కొనుగోలుదారులతో సందడిగా కన్పించాయి. మాదాపూర్ శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కథక్, కూచిపూడి, నృత్య ప్రదర్శలు ప్రేక్షకులను అలరించాయి. ప్రముఖ నాట్య గురువు సంజయ్ జోషి శిష్య బృందం కృష్ణ థాట్, కృష్ణ వందన, వసంత్ రాస్, సూరదాస్ భజన, తరణ, తాల్ తీన్‌లాల్ మొదలైన అంశాలను సజయ్ జోసి, అనుష్క, ఆత్రయి, నేహా, ప్రేమ, ఆర్య అదితి, మధుమితలు ప్రదర్శించారు. కూచిపూడి నాట్య గురువు బిందు అభినవ్ శిష్య బృందం మోదమున, జతిస్వరం, ఆనంద తాండవం, రామాయణ శబ్దం ప్రదర్శించారు.

ఆశావర్కర్లకు కనీస వేనతం ఇవ్వాలి



ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిలాపురం రాజశేఖర్

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి బిలాపురం రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఇందిరాపార్క్ వద్ద జరిగిన రాష్ట్రస్థాయి నిరసనకు బాలానగర్ నుంచి ఆశావర్కర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశావర్కర్లకు జీతంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్‌కు ఆమోదం తెలపాలన్నారు. లేని పక్షంలో మంత్రులు, ఎమ్మెల్యే, అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. ఆశాలపై పనిభారం తగ్గించేందుకు అర్హత కలిగిన వారికి ఏఎన్‌ఎంలుగా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, అనిత, సబియా, భాషమ్మ, సంతోష్ భాయ్, భాగ్యలక్ష్మి, రేణుక, విజయలక్ష్మి, మంజుల, పద్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే సహించం

- తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే సహించేది లేదని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో-కన్వీనర్ బీసీ రెడ్డి అన్నారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ పిలుపుతో మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో వెంగళ్‌రావునగర్ కాలనీలోని టీజీజెన్‌కో ఈఆర్‌పీ భవనం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. పలు రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. డిసెంబరులో లక్నోలో జరిగిన సమావేశంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, చండీగఢ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని దేశంలోని ఇంజనీర్లంతా వ్యతిరేకించారన్నారు. ఉత్తరప్రదేశ్ ఉద్యోగులపై ఎస్మా ప్రకటించినా గాంధేయ మార్గంలో నిరసనలు తెలుపుతున్నారని చెప్పారు. కో కన్వీనర్ బీసీ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని తాము అడ్డుకుంటామన్నారు. ఆయా రాష్ట్రాల విద్యుత్ ఇంజనీర్లకు మద్దతుగా ఈ ఆందోళన చేపట్టామన్నారు. దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనైనా విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేదిశగా అడుగులు పడినా వాటిని అడ్డుకునేందుకు విద్యుత్ ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈశ్వర్‌గౌడ్, సదానందం, మనోరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌కుమార్, కిరణ్, బాగయ్య, సతీష్, వెంకటేష్, భాస్కర్, సమ్మర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

- ఎనిమిది మంది నిందితులకు బేడీలు
- రూ. 3లక్షల విలువైన సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు సహా.. ఇతర దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ఆటకట్టించారు సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ఆరుగురు నిందితులను, ఇద్దరు రిసీవర్స్ మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... హుస్సేనీ ఆలం, ఐస్ సదన్ పోలీస్ పరిధిలో వరుస సెల్‌ఫోన్‌చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. దాంతో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ ఎవిడెన్స్‌తో నిఘా పెట్టి నిందితుల ముఠాను పట్టుకున్నారు. షాహీన్‌నగర్‌కు చెందిన ఎండీ అబ్బాస్‌అలీ అలియాస్ చోర్ అబ్బాస్‌కు 60 ఏళ్లు. ఇతడు 35 ఏళ్లుగా దొంగతనాలు, దోపిడీలు, గొడవలు, కొట్లాటలు, ఇతరులపై భౌతిక దాడులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో అతనిపై హుస్సేనీఆలం పీఎస్‌లో రౌడీషీట్‌తో పాటు.. నగరంలో 37 కేసులు ఉన్నాయి. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటుపడిన చోర్ అబ్బాస్ సులభంగా డబ్బు సంపాదనకు దొంగతనాలు దోపిడీలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మరో నలుగురు యువకులు మహ్మద్ సాధిక్, మహ్మద్ రిజ్వాన్, మహ్మద్ దస్తగిరి, మహ్మద్ సత్తార్‌ను తనతో చేర్చుకొని ముఠాగా ఏర్పడ్డాడు. రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్స్ పరిధిలోని నిర్మానుష్య, రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లను చోరీచేస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే కత్తితో బెదిరించి పరారవుతున్నారు. ఇలా కొట్టేసిన సెల్‌ఫోన్‌లను రెయిన్ బజార్‌కు చెందిన షేక్‌అజహర్, అజ్జూకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు ఐస్‌సదన్, హుస్సేనీ ఆలం పోలీసులతో కలిసి 8 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్‌లు, ఒక కత్తి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

రమ్యగ్రౌండ్ ఎవరిది?

- కేపీహెచ్‌బీలో 2.14 గుంటల స్థలం స్కూల్‌కు కేటాయింపు
- బోర్డులు ఏర్పాటు చేసిన హౌసింగ్‌బోర్డు అధికారులు
- చర్చనీయాంశంగా స్థల వ్యవహారం
- శాఖల మధ్య సమన్వయ లోపం..
- ప్రజలకు తప్పని తిప్పలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాల నిమిత్తం లే అవుట్‌లో వదిలిపెట్టిన స్థలంపై నాలుగు దశాబ్దాల తర్వాత కూడా సందిగ్ధత నెలకొనే ఉంది. కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లో 2.14 గుంటల స్థలాన్ని హౌసింగ్‌బోర్డు లే అవుట్‌లో పాఠశాల కోసం అని విడిచిపెట్టారు. గత కొన్నేళ్లుగా జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ అధికారులు ఈ గ్రౌండ్‌పై పెత్తనం చెలాయిస్తూ ఇక్కడ జరిగే కార్యక్రమాలకు కూడా డీడీల రూపంలో నగదు తీసుకుంటోంది. వారం రోజుల క్రితం ఈ స్థలం హౌసింగ్‌బోర్డుకు సంబంధించినదంటూ తాజాగా కొత్తగా బోర్డులు పెట్టడంతో మళ్లీ చర్చకు వచ్చింది. యాక్షన్ పెట్టి అమ్ముతారా? గతంలో ప్రభుత్వ పాఠశాల కోసం ఫ్రీగా ఇచ్చిన దానికి కట్టుబడి ఉంటారా అన్నది తెలియాల్సి ఉంది.

స్కూల్‌కు కేటాయించిన స్థలం

లే అవుట్ వేసింది హౌసింగ్ బోర్డు అయినప్పటికీ ప్రజా అవసరాల నిమిత్తం స్కూల్‌కు కేటాయించిన స్థలం ఎవ్వరికీ అప్పగించకపోవడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. రెండేళ్ల క్రితం ప్రభుత్వ స్కూల్ నిర్మాణానికి కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు రూ.కోటి ఇస్తామని చెప్పడంతో కలెక్టర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ శంకుస్థాపన కూడా చేశారు. కానీ హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు ఆ స్థలం బదిలీ కాకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో హౌసింగ్ బోర్డు స్థలాల రక్షణ కోసం ఇటీవల ప్రహరీ నిర్మిస్తుండగా.. రమ్యగ్రౌండ్‌లో కూడా బోర్డులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన నందమూరి తారకరామారావు పాఠశాల పనులు ఎన్నికల సమయంలోనే ఆగిపోయాయి. తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో దాత అయిన కార్పొరేటర్ బీఆర్‌ఎస్, ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కావడంతో దానికితోడు ఇచ్చిన మాట ప్రకారం స్కూల్ నిర్మాణం చేస్తామని చెబుతున్నా జిల్లా విద్యాశాఖాధికారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. లే అవుట్‌లో స్కూల్ కోసం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలనేది ఏమీ ఉండదని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా మేము పాఠశాల ఏర్పాటు చేస్తాం అంటే సదరు రమ్యగ్రౌండ్‌ను వారికి విక్రయించే హక్కు హౌసింగ్‌బోర్డుకు ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో దాతల సహకారంతో నిర్మించ తలపెట్టిన నందమూరి తారకరామారావు పాఠశాల పనులు పునఃప్రారంభం అవుతాయా? అన్న సందేహం నెలకొంది. ఎవరైనా విద్యావేత్త ముందుకొచ్చి స్కూల్ నిర్మిస్తాం.. ఆ స్థలం ఇవ్వమని ముందుకొస్తే ప్రభుత్వ పాఠశాల అటకెక్కినట్లేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రౌండ్ నిర్వాహణ జీహెచ్‌ఎంసీ చూసుకుంటున్నప్పటికీ స్థలంపై వారికి ఎలాంటి హక్కులు ఉండవు అంటున్నారు.



రమ్యగ్రౌండ్‌లో తాజాగా హౌసింగ్‌బోర్డు అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ఏం జరుగుతోంది..

రమ్యగ్రౌండ్‌లో హౌసింగ్ బోర్డు అధికారులు ఏర్పాటు చేసిన బోర్డుల గురించి స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ గ్రౌండ్‌ను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అసలు మీకు ఏం హక్కు ఉందని బోర్డులు పెట్టారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడం ఏంటి? కూలిన ప్రహరీ నిర్మించారా? ఏనాడైనా గ్రౌండ్ అభివృద్ధి గురించి పట్టించుకున్నారా? అంటూ ఎమ్మెల్యే హౌసింగ్ బోర్డు అధికారులపై ఫోన్‌లో గరంగరం అయ్యారు. టపాసుల దుకాణాలు పెట్టుకున్నప్పుడు జీహెచ్‌ఎంసీ డబ్బులు వసూళ్లు చేసినప్పుడు మీరు ఏం చేశారు? ఎగ్జిబిషన్లు, స్కూల్‌కు గ్రౌండ్‌ను అద్దెకు ఇచ్చినప్పుడు మీరు ఎందుకు అడ్డుకోలేదు? అసలు గ్రౌండ్‌ను అమ్ముకుందాం అనుకుంటున్నారా? మీ ఆటలు సాగవు.. స్థానికులతో కలిసి మీ ఆగడాలను అడ్డుకుంటాం అంటూ ఆగ్రహంతో ఎమ్మెల్యే ఊగిపోయారు. మీకు మేమున్నాం.. అవసరమైతే ఆ బోర్డులు వారు తీసేయకపోతే మీరే పీకేయండి ఏమైనా ఉంటే మేము చూసుకుంటాం అని స్థానికులకు భరోసా ఇచ్చారు.



ఫోన్లో హౌసింగ్‌బోర్డు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు (ఫైల్)

బోర్డులు ఏర్పాటు చేశాం అంతే..

మేము మా జోన్ పరిధిలో ఉన్న అన్నీ ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేశాం. అందులో భాగంగానే కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్‌లో కూడా పెట్టాం. స్థలాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలా? హౌసింగ్‌బోర్డు అమ్ముకోవచ్చా అన్నది ఉన్నతాధికారులు చూసుకుంటారు. ప్రభుత్వ పాఠశాల నిర్మిస్తామంటే గతంలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు రాశాం. కానీ వారు దాన్ని స్వాధీనం చేసుకోలేదు. స్థలాలను రక్షించే క్రమంలో కొన్నిచోట్ల ప్రహరీ నిర్మిస్తుండగా.. మరి కొన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం.

- కిరణ్‌బాబు, ఈఈ,
వెస్ట్రన్ డివిజన్, టీఎస్‌హెచ్‌బీ

యువత మత్తుకు చిత్తు కావద్దు



డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ శ్రీనివాసరావు, మాధవరం కాంతారావు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం కేపీహెచ్‌బీలో 'యువత మేలుకో.. మత్తును వదులుకో' అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మత్తుపదార్థాల వినియోగంవల్ల యువత పెడదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు చిత్తు కాకుండా ఉండేందుకు యువతలో మార్పు తీసుకొచ్చేందుకు స్వచ్ఛ భారత్ అభియాన్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. చెడు అలవాట్లకు బానిసలవుతున్న యువతను సక్రమమైన దారిలో నడిచేలా తమవంతు బాధ్యతగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాల్సిన యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవడం చూస్తుంటే బాధేస్తోందన్నారు. డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీలో అడ్వకేట్లు, డాక్టర్లు తదితరులు పాల్గొని సే నో టూ డ్రగ్స్ అంటూ నినదించారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు, ఎస్సై సుమన్, బీజేపీ బాలాజీనగర్ ప్రధానకార్యదర్శి కర్ర గోపీకృష్ణ, నాయకులు సన్నీ, వినోద్, పవన్, కేశవ, రవి, శ్రీకర్‌రావు, వంశీరెడ్డి, శేఖర్, సాయినాథ్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విక్టోరియాకు వీడ్కోలు



విక్టోరియాను సన్మానించి వీడ్కోలు చెబుతున్న వైద్యులు, సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న విక్టోరియా మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. వైద్యాధికారి డా.వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వీడ్కోలు కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.టి.రంగస్వామినాథ్ స్వామి హాజరయ్యారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. డా.శోభారాణి, డా.సరస్వతి, సూపర్‌వైజర్లు బోగి ప్రకాష్, రవిప్రకాష్ హాజరయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



యూత్ కాంగ్రెస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బండి రమేష్

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను మంగళశారం ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సలీం ఉద్దీన్, డివిజన్ల అధ్యక్షులు ఆమేర్, సుల్తాన్, చందు, వెంకట్, హర్షద్, వెంకటస్వామి, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆంజనేయ నగర్‌లో జరుగుతున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ప్రగతినగర్ వీరాంజనేయస్వామిని దర్శించుకొని ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలు ఆమోదంపై ఎమ్మెల్యే హర్షం

హైదర్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సిఫార్సు లేఖలపై దర్శనాలకు ఏపీ సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి జీఓ విడుదల చేయడంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు ఆమోదించడం అభినందనీయమన్నారు. ఈ విషయమై తెలంగాణ నుంచి మొట్టమొదటగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్‌తో చర్చించి వినతిపత్రం అందించింది తానేనని గుర్తు చేశారు. ఏపీ చంద్రబాబునాయుడు, టీడీపీ చైర్మన్ బీఆర్ నాయకుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వారినికి రెండు బ్రేక్ దర్శనాలు, రెండు ప్రత్యేక దర్శనలకు ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



అయ్యప్పస్వామి పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

హైదర్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని శ్రీహరి హరసుతుడైనటువంటి అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. లక్ష్మీగణపతిహోమం, ఆరాట్ ఉత్సవం, 18కలశాల మహాపడి పూజ, అన్న సమారాధన కార్యక్రమం వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, హాజరైస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, అయ్యప్పమాలాధరణ భక్తులు పాల్గొన్నారు.



- వివేకానంద నగర్ డివిజన్ సప్తగిరి కాలనీ అయ్యప్పస్వామి ఆలయంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు - హైదర్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి)

6 నుంచి శంకరమఠంలో తిరుప్పావయ్ పావురాలు - పారాయణ

అల్లాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా మూసాపేట డివిజన్ మోతీనగర్‌లో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు సంగీత కవుల ఆరాధన వైభవం, తిరుప్పావై పాశురాలు-పారాయణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మఠం ప్రతినిధి సీఎస్‌ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రెండు రోజులు కమలా సీతారామన్ ఆధ్వర్యంలో సంగీత కవుల ఆరాధన వైభవం ఉంటుంద ని, ఈనెల 8, 9 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తిరుప్పావై పాశురాలు - పారాయణ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మోతీనగర్‌లోని శృంగేరీ శారదా శంకర మఠం వేదికన జరుగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు ఆహ్వానితులేనని ప్రకటించారు.

ఆకట్టుకున్న రైతు దినోత్సవం నాటకం



రైతు దినోత్సవం నాటక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

హైదర్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వివేకానందనగర్ నారాయణ ఇటెక్నో హైస్కూల్లో ఫార్మర్స్‌డే రైతు దినోత్సవం సందర్భంగా పిల్లలు వివిధ రకాల వ్యవసాయ వృత్తులను నాటకం ద్వారా ప్రదర్శించారు. దేశానికి రైతే వెన్నుముకని ప్రిన్సిపల్ శ్వేత అన్నారు. తమ విద్యార్థులు రైతు పడే కష్టం నాటక రూపంలో ప్రదర్శించారని, నేటి తరం పిల్లలకి రైతు విలువ తెలిసేలా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నారాయణ గ్రూప్స్ ఏజీఎం వేణుగోపాల్‌రావు, కోఆర్డినేటర్ సల్మా, వైస్‌ప్రిన్సిపల్ కవితరెడ్డి, నారాయణ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రై కమిషనరేట్లలో సిబ్బంది ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో సైబారాబాద్ సీపీ అవినాష్ మహంతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రై కమిషనరేట్లలో రిటైర్డ్ అయిన పోలీసు అధికారులకు సిబ్బందికి ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13 మంది అధికారులకు ఇన్‌చార్జ్ సీపీ విక్రంసింగ్‌మాన్ వీడ్కోలు పలికారు. కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సత్కరించారు. సుదీర్ఘకాలం పాటు సేవలందించిన అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మిన్ అధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ రెడ్డితోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాచకొండలో...

రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్‌ఐ ఆర్.లచ్చిరాం, స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేసిన ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జి.కృష్ణను సీపీ సుధీర్ బాబు, ఎల్‌బీనగర్‌లోని రాచకొండక్యాంపు కార్యాలయంలో సన్మానించారు. డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఎల్బీనగర్ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్‌ఐ నాయుడు, పోలీస్‌అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులది ఎంతో కీలకమైన పాత్ర అని, ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సైబారాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. మంగళవారం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు అధికారులను సన్మానించి, వీడ్కోలు పలికారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ షేక్‌ఇక్బాల్, సీఏఆర్ ప్రధాన కార్యాలయంలో ఏఆర్‌హెచ్‌సీ కె.బాయ్య ఉద్యోగ విరమణ పొందారు. వారిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను కొనియాడారు. వారికి పెన్షన్ పత్రాలను అందజేశారు. జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్‌డేవిస్, ఏడీసీపీ అడ్మిన్ రవిచంద్రన్ రెడ్డి, సీఏఆర్ కేంద్ర కార్యాలయం ఏడీసీపీ షమీర్, ఎస్టేట్ ఆఫీసర్ హిమకర్, సీపీఓలు గీత, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదాలకు నిలయం పార్కులు



కావూరిహిల్స్‌లోని పార్కును పరిశీలిస్తున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఐటీ పరిశ్రమలు అధికంగా ఉన్న శేరిలింగంపల్లిలో మాల్స్ హాల్స్‌కు ప్రత్యామ్నాయంగా ఆహ్లాదాన్ని అందించేలా పారుకలు తీర్చిదిద్దుతున్నట్టు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జోన్ పరిధిలోని పార్కులను ఆయన పరిశీలించారు. మాదాపూర్ కావూరిహిల్స్‌లోని పార్కును ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. ఇప్పటికే థీమ్ పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కాలనీలోని పార్కులను పూర్తిస్థాయిలో సుందరీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్, చిన్నారులకు ఆట పరికరాలు, పచ్చదనం, ప్రహరీలపై అందమైన చిత్రాలు, పార్కు వచ్చే వారు హాయిగా సేద తీరేలా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డీసీ మోహన్‌రెడ్డి, ఈఈ కేవీఎస్ఎన్ రాజు, నాగిరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

బాలురు, బాలికల వసతిగృహానికి ఆర్థిక సాయం



నందిగామ బాలుర బాలికల వసతిగృహానికి నిమ్మల మనోహర్ గౌడ్ జ్ఞాపకార్థం ఆయన చిన్న కుమారుడు దాత్రిగౌడ్ మంగళవారం గౌడ్ హాస్టల్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొంతి లక్ష్మీనారాయణగౌడ్ రూ.5లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం తరుపున లక్ష్మీనారాయణగౌడ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

- మియాపూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి)

వృద్ధాశ్రమ స్థలం ఆక్రమిస్తున్నారని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ్రమం నిర్వాహకులు, వృద్ధులు

హైదర్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని శ్రీరాజేశ్వరి వృద్ధుల అనాథాశ్రమానికి చెందిన స్థలాన్ని మంగళవారం కొందరు ఆక్రమించేందుకు యత్నించారు. దీనికి నిరసనగా నిర్వాహకులు వృద్ధాశ్రమంలో ఉన్న వారితో కలిసిన నిరసన వ్యక్తం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ... గతంలో జి.సత్తయ్య దగ్గర తాను రూ.16లక్షలు వెచ్చించి స్థలాన్ని కొన్నానని, ఇప్పుడు అతడి కుమారుడు నర్సింగ్ వచ్చి బెదిరింపులకు గురిచేయ్యడమే కాకుండా దాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తనకు రాజకీయ నాయకుల అండద ఉందని, అడిగినంత డబ్బు ఇవ్వాలని, లేదంటే స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని, వృద్ధాశ్రమం వెనుక ఉన్న తమ స్థలానికి దారి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని నిర్వాహకులు వాపోయారు. దీనిపై ఇప్పటికే జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలని కోరారు.

న్యూ 'ఇయర్' జోష్

- జోరుగా కేక్‌ల విక్రయాలు
- రద్దీగా రహదారులు, షాపింగ్‌మాల్స్



కొనుగోలు దారులతో రద్దీగా ఉన్న బేకరీ



మియాపూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ఐటీ నియోజకవర్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచే న్యూ జోష్ మొదలైంది. డిసెంబర్ 31 మంగళవారం అర్ధరాత్రితో 2024 సంవత్సరం ముగిసి 2025 నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టే సమయాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు యువత, చిన్నారులు భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. బేకరీల వద్ద కేక్‌ల కొనుగోళ్లతో సందడి వాతావరణం నెలకొంది. గేటెడ్ కమ్యూనిటీ వాసులు పెద్దఎత్తున మ్యూజిక్, కల్చరల్ యాక్టివిటీస్ కార్యాక్రమాలు ముందుగానే ప్రారంభమయ్యాయి.

శేరిలింగంపల్లి ఐటీ నియోజకవర్గం ప్రాంతంలో 2025 సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఫ్యామిలీలు, యువత ఏర్పాట్లు చేసుకున్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి అపశృతి జరగకుండా సంతోషాలతో జరుపుకోవాలని ఈవెంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి తగిన సూచనలను చేశారు. ప్రభుత్వం నిబంధనలను అనుసరిస్తూ వేడుకలను ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఈవెంట్ పరిసరాల్లో ఏమైనా సంఘటనలు జరిగితే వాటికి ఈవెంట్ నిర్వాహకులే బాధ్యత వహించాలని సూచించడంతో ఈవెంట్ల నిర్వాహకులు భద్రతా చర్యలు తీసుకొని ఏర్పాట్లు చేసుకున్నారు.

ముస్తాబైన పలు చర్చిలు



నూతన సంవత్సరం సందర్భంగా ప్రార్ధనలకు ముస్తాబైన మియాపూర్‌లోని కల్వారిటెంపుల్

మియాపూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సర వేడుకల సందర్భంగా మియాపూర్‌లోని కల్వారిటెంపుల్‌కు పెద్దఎత్తున తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చర్చిని రంగు రంగు విద్యుత్ దీపాలు, స్టార్స్, క్రిస్మస్‌ట్రీలతో అలంకరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాదాపూర్, హైటెక్‌సిటీ , మియాపూర్, మదీనగూడ, హఫీజ్‌పేట, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, రాయదుర్గం, ప్రశాంత్‌హిల్స్, గోపన్‌పల్లి, కొండాపూర్, నల్లగండ్ల, జీపీఆర్‌ఐక్వార్టర్స్, బీహెచ్ఈఎల్, కొండాపూర్, మసీద్‌బండ ప్రాంతాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

మియాపూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులు, కార్యకర్తలు పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈఏడాది అందరు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.

- మియాపూర్ డివిజన్ ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రశాంత్‌నగర్‌లో స్థానికులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కాలనీలో సమస్యలు పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ ప్రశాంత్‌నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ప్రశాంత్‌నగర్‌లో పాదయాత్ర చేసి సమస్యలు పరిశీలించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులు, డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కాలనీలో వరదనీరు నిలవకుండా చైస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రద్ధతో చదివితే అత్యున్నత స్థాయికి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవికుమార్‌యాదవ్

హైదర్‌నగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉండి చదువుకోలేని వారికి సందయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుస్తకాలు, నగదు బహుమతులు అందించి ప్రోత్సహించడం జరుగుతోందని ట్రస్టు కార్యదర్శి, శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ షంషీగూడ, ఎల్లమ్మబండ, ప్రభుత్వ పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్టు, ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 350మందికి పైగావిద్యార్థులకు రవికుమార్‌యాదవ్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా బాగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రావు, నర్సింగ్‌యాదవ్, నరసింహచారి, కుమార్‌యాదవ్, వెంకటస్వామి, సత్యనారాయణ, స్రవంతి, డాక్టర్ వంశీ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

శిల్పారామంలో ముగిసిన ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళా

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా మంగళవారం ముగిసింది. ఈ క్రాఫ్ట్ మేళాలో పలు స్టాళ్లు కొనుగోలుదారులతో సందడిగా కన్పించాయి. మాదాపూర్ శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కథక్, కూచిపూడి, నృత్య ప్రదర్శలు ప్రేక్షకులను అలరించాయి. ప్రముఖ నాట్య గురువు సంజయ్ జోషి శిష్య బృందం కృష్ణ ఠాట్, కృష్ణ వందన, వసంత్ రాస్, సూరదాస్ భజన, తరణ, తాల్ తీన్‌లాల్ మొదలైన అంశాలను సజయ్ జోసి, అనుష్క, ఆత్రయి, నేహా, ప్రేమ, ఆర్య, అదితి, మధుమితలు ప్రదర్శించారు. కూచిపూడి నాట్య గురువు బిందు అభినవ్ శిష్య బృందం మోదమున, జతిస్వరం, ఆనంద తాండవం, రామాయణ శబ్దం ప్రదర్శించారు.

పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన పెను ప్రమాదం

గచ్చిబౌలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరినగర్‌లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలెండర్ పేలి క్షణాల్లోనే ఇల్లంతా మంటలు వ్యాపించాయి. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గెల్యాక్సీ అపార్ట్‌మెంట్ ప్లాట్‌నెం 907లో సునీల్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో వంట చేస్తుండగా సిలెండర్ ఒక్కసారిగా పేలడంతో బయటకు పరుగులు తీశారు. ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఇంటిలోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ రోజే గ్యాస్ సిలెండర్ బిగించి వంట చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నూతన సంవత్సర వేడుకలు

హైటెక్ సిటీలోని మైహోంభుజలో వేగ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో కొత్త ఏడాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపు 2 వేలమంది పాల్గొన్న ఈ వేడుకలకు సినీ దర్శకులు నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, వలనేని గోపీచంద్, సంజన్ రెడ్డి, నటీమణులు మీనాక్షి చౌదరి, ఇషారెబ్బ, నిర్మాతలు నాగవంశీ, చిరంజీవి కుమార్తె సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి).

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

- ఎనిమిది మంది నిందితులకు బేడీలు
- రూ.3లక్షల విలువైన సొత్తు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు సహా.. ఇతర దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ఆటకట్టించారు సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ఆరుగురు నిందితులను, ఇద్దరు రిసీవర్స్ మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... హుస్సేనీ ఆలం, ఐస్ సదన్ పోలీస్ పరిధిలో వరుస సెల్‌ఫోన్‌చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. దాంతో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ ఎవిడెన్స్‌తో నిఘా పెట్టి నిందితుల ముఠాను పట్టుకున్నారు. షాహిన్‌నగర్‌కు చెందిన ఎండీ అబ్బాస్‌అలీ అలియాస్ చోర్ అబ్బాస్‌కు 60 ఏళ్లు. ఇతడు 35 ఏళ్లుగా దొంగతనాలు, దోపిడీలు, గొడవలు, కొట్లాటలు, ఇతరులపై భౌతిక దాడులకు పాల్పడేవాడు.

ఈ క్రమంలో అతనిపై హుస్సేనీఆలం పీఎస్‌లో రౌడీషీట్‌తో పాటు.. నగరంలో 37 కేసులు ఉన్నాయి. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటుపడిన చోర్ అబ్బాస్ సులభంగా డబ్బు సంపాదనకు దొంగతనాలు దోపిడీలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మరో నలుగురు యువకులు మహ్మద్ సాధిక్, మహ్మద్ రిజ్వాన్, మహ్మద్ దస్తగిరి, మహ్మద్ సత్తార్‌ను తనతో చేర్చుకొని ముఠాగా ఏర్పడ్డాడు. రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్స్ పరిధిలోని నిర్మానుష్య, రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లను చోరీచేస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే కత్తితో బెదిరించి పరారవుతున్నారు.

ఇలా కొట్టేసిన సెల్‌ఫోన్‌లను రెయిన్ బజార్‌కు చెందిన షేక్‌అజహర్, అజ్జూకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు ఐసదన్, హుస్సేనీ ఆలం పోలీసులతో కలిసి 8 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్‌లు, ఒక కత్తి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.



సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, పార్టీ నాయకులు

రాజకీయ కుట్రతోనే బీఎస్పీ కార్యాలయంపై దాడి

- రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

ఖైరతాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఎస్పీ ఎదుగుదలను ఓర్వలేని కొందరి కుట్రలో భాగంగానే తమ పార్టీ కార్యాలయంపై దాడి చేశారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్లతో కలిసి మాట్లాడిన అనంతరం తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తనకు ఎలాంటి స్వచ్ఛంద సంస్థ లేదని, రైతులతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా రుణాల పేరుతో మోసం చేసినట్టు ఆరోపిసస్తూ కార్యాలయంపై దాడి చేశారని మండిపడ్డారు. దీని వెనుక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో పాటు మనువాద పాలకుల కుట్ర ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చబోతోందని, ఈ విషయమై బహుజనుల్లో చైతన్యం తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను అణచివేసే కుట్రలో భాగంగానే ఇలా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన 40 మందిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరినట్టు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాం కృష్ణ, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామచంద్రం, గొల్ల సతీష్, అంతటి నాగన్న, జక్కుల వెంకట్, కోశాధికారి నాయిని ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ కమిషనరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సత్కరిస్తున్న ఉన్నతాధికారులు

ట్రై కమిషనరేట్లలో సిబ్బంది ఉద్యోగ విరమణ

- ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికిన ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రై కమిషనరేట్లలో రిటైర్డ్ అయిన పోలీసు అధికారులకు సిబ్బందికి ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13 మంది అధికారులకు ఇన్‌చార్జ్ సీపీ విక్రంసింగ్ మాన్ వీడ్కోలు పలికారు. కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఘనంగా పత్కరించారు. సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మిన్ అధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్ శంకర్ రెడ్డితోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాచకొండలో...

రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ ఆర్.లచ్చిరాం, స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేసిన ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జి.కృష్ణను సీపీ సుధీర్ బాబు, ఎల్‌బీనగర్‌లోని రాచకొండక్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఇన్ని రోజులు పోలీసుశాఖలో సమర్థవంతంగా క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమములో డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఎల్బీనగర్ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ నాయుడు, పోలీస్‌అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సైబరాబాద్ పరిధిలో..

హైదరాబాద్‌సిటీ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులది ఎంతో కీలకమైన పాత్ర అని, ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సైబారాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. మంగళవారం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు అధికారులను సన్మానించి, వీడ్కోలు పలికారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్‌ఇక్బాల్, సీఏఆర్ ప్రధాన కార్యాలయంలో ఏఆర్‌హెచ్‌సీ కె.బాయ్య ఉద్యోగ విరమణ పొందారు. వారిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను కొనియాడారు. వారికి పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్‌డేవిస్, ఏడీసీపీ అడ్మిన్ రవిచంద్రన్ రెడ్డి, సీఏఆర్ కేంద్ర కార్యాలయం ఏడీసీపీ షమీర్, ఎస్టేట్ ఆఫీసర్ హిమకర్, సీపీఓలు గీత, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైబరాబాద్ పరిధిలో.. ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో సైబారాబాద్ సీపీ అవినాష్ మహంతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్ తదితరులు

జోరుగా అక్రమ నిర్మాణాలు

- అధికారులను బదిలీ చేసినా ఆగని పనులు
- ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న బిల్డర్లు

షాపూర్‌నగర్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): సూరారం, గాజులరామారం డివిజన్ల పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులను బదిలీ చేసినా అక్రమ నిర్మాణాల దందాకు అడ్డుకట్టపడటం



ఆదర్శనగర్‌లో ఓ అక్రమకట్టడం

లేదు. గతంలో సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహించిన టౌన్‌ప్లానర్‌తో పాటు ఇద్దరు సెక్షన్ అధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం 50 రోజుల క్రితం ఈ ముగ్గురు అధికారులను బదిలీ చేసింది. దీంతో అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు భావించారు. కానీ సూరారం, గాజులరామారం డివిజన్‌లతో పాటు జగద్గిరిగుట్ట, చింతల్ డివిజన్లలో అక్రమ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. భవన యజమానులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అవినీతి అక్రమాల్లో మిలాఖతవుతున్నారు.

గాజులరామారం డివిజన్‌లోని హెచ్‌ఏఎల్‌కాలనీ, ఆదర్శనగర్, మెట్‌కానీగూడ, సూరారం డివిజన్‌లోని శ్రీరాంనగర్, షాపూర్‌నగర్, సూరారం, సంజయ్‌గాంధీనగర్, కళావతినగర్, ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల దందా జోరుగా నడుస్తుంది.

బిల్డర్లకు అండగా సిబ్బంది

సూరారం డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో నిర్మాణానికి ముందు ఒకరకంగా, నిర్మాణం చేపట్టేటపుడు మరోలా నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరికొందరు అనుమతులు లేకుండానే నిర్మాణాలను చేపడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నారు.

ఇలాంటివి సంఘటనలు సర్కిల్ పరిధిలో ఎన్నో జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందే నిర్మాణదారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా ఉన్నతస్థాయి అధికారులు, ఎందుకు పట్టించుకోవడం లేదో ఎవరికి అర్థం కాని ప్రశ్నగా మిగిలింది.

ఇప్పటికైనా బదిలీపై వచ్చినవారు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేవిధంగా క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఎక్కడ అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



షాపూర్‌నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

కఠిన చర్యలు తీసుకుంటాం

భవన నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. సిబ్బంది ఎవరైనా నిర్మాణదారులకు సహకరిస్తే వారిపై చర్యలు తీసుకొంటాం. పర్మిషన్ తీసుకొనేటప్పుడు ఎలా ఉంటుందో అదేవిధంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

- మల్లారెడ్డి, డీసీ, గాజులరామారం

నిర్లక్ష్యం.. నిరుపయోగం

- మూలన పడ్డ జిమ్ సామగ్రి
- పట్టించుకోని అధికారులు



కమ్యూనిటీహాల్‌ల్లో మూలన పడిన జిమ్ సామగ్రి



చిందర వందరగా పడి ఉన్న జిమ్ సామగ్రి

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రతి సర్కిల్‌లో 2015-16లో యువతకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని 8 డివిజన్లలో రూ.50 లక్షల నిధులు వెచ్చించి జిమ్‌లను ఏర్పాటు చేశారు. జీడిమెట్ల డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో రూ. 7లక్షల నిధులతో జిమ్‌లను ఏర్పాటు చేశారు.

వీటిని కార్పొరేటర్ ఆధ్వర్యంలో యువతకు నామమాత్రం ఫీజుతో అందించాలని ఏర్పాటు చేశారు. శ్రీనివాసనగర్‌లో ఏర్పాటుచేసిన జిమ్ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో జిమ్ సామగ్రి మొత్తం తుప్పుపట్టి, మూలన పడి ఉన్నాయి. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన జిమ్ నిర్వహణను సరిగా పట్టించుకోకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జీడిమెట్ల డివిజన్‌లో లక్షలు నిధులు వెచ్చించి ఇటీవల పార్కుల్లో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌ల పరిస్థితి కూడా ఇలానే ఉంటుందా? లేక వాటి నిర్వహణను కాలనీ అసోసియేషన్ సభ్యులకు అప్పచెప్పి, వినియోగంలో ఉండేలా చేస్తారా? అని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీడిమెట్ల శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్లో మూలన పడ్డ జిమ్‌ను యువతకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



మరమ్మతు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుత్బుల్లాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్‌రెడ్డినగర్‌లో భూగర్భ డ్రైనేజీ తవ్వి ప్యాచ్ వర్క్‌లు చేయకపోవడంతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బాల్‌రెడ్డినగర్ నుంచి పద్మానగర్ ఫేజ్-1కు వెళ్లే రోడ్డులోని గుంతల రోడ్డుకు ప్యాచ్‌ల పనులను ప్రారంభించారు. సమస్య పరిష్కరించడంలో కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్



ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

గాజులరామారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, యువత రోడ్లపైకి వచ్చి ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారం నడిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. తాగి వాహనాలను నడిపితే జరిమానా విధించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు.



భరత్‌సింహారెడ్డికి తాగునీటి సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

నీటి సమస్యను పరిష్కరిస్తా

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ జయరామ్‌నగర్‌లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీరు సరిగారావడం లేదని, కుత్బుల్లాపూర్ గ్రామంలో మురుగు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో నార్లకంటి దుర్గయ్య, ప్రతాప్, కృష్ణ, సాయిలు, సందీప్, మహేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో పనిచేస్తున్న లక్ష్మయ్య కుమారుడు అరవింద్ (6) రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కాలనీ రహదారి పక్కనే ఉన్న ఖాళీస్థలంలో పతంగిని ఎగురవేస్తుండగా నాలుగు కుక్కలు బాలుడిపై విచక్షణరహితంగా దాడి చేశాయి. దారిన వెళ్లే స్థానికులు కుక్కలను బెదిరించడంతో బాలుడిని వదిలేశాయి. కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలి

జీడిమెట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్టలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మరమ్మతుల పేరుతో జీహెచ్ఎంసీ అధికారులు కోట్లరూపాయలు కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నా ఫలితం ఉండటం లేదు. నెల రోజులుగా జనంతో రద్దీగా ఉండే జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ సమీపంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు అస్తవ్యస్తంగా మారినరోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భూ కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి



గాజులరామారం డీసీ మల్లారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల,డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప బ్లాక్ నంబర్ 32వద్ద మార్కెట్ నిర్మాణం కోసం వదిలిన స్థలాన్ని తప్పుడు పత్రాలతో కబ్జా చేయడానికి యత్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరుడు ఎత్తరి మారయ్యపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని బీజేపీ నాయకులు ఆకుల సతీష్, జైశంకర్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం గాజులరామారం సర్కిల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందచేశారు. జీహెచ్ఎంసీ అధికారులు ఇచ్చిన ఇన్‌స్టెంట్ అనుమతులను రద్దు చేయాలని, పరిశీలించకుండా అనుమతులు జారీచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జాస్థలాన్ని కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంబరి ఆంజనేయులు, చందు, ఈశ్వర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

గాజులరామారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం డివిజన్ పరిధి బతుకమ్మబండలోని శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని సీనియర్ సిటిజన్స్ భవనంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ దేవాలయ అభివృద్ధికి తామెప్పుడు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సేవలందించేందుకు కృషి చేస్తా

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సభ్యులు స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారుడు. బీ.బల్వంత్‌రెడ్డి, అధ్యక్షులు ఎస్.నర్సింహారెడ్డి, కార్యదర్శి పి.మల్లేష్, కోశాధికారి ఆర్ మురళీ, సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

మరో కార్యక్రమంలో

దుండిగల్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం నూతన కమిటీ సభ్యులు, దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేశం ముదిరాజ్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం అమ్మ వారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం నూతన కమిటీ సభ్యులు రాజు, సత్యనారాయణ, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.